ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 08 జనవరి, 2025 | పేజీలు : 6




ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడలు అభినందనీయం

# కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు

## ప్రతిపక్షాల విమర్శలకు దిమ్మతిరిగే సమాధానం ఇవ్వాలే : ఎంఎల్ఎ బాలు నాయక్



**ప్రజాపక్షం/పెద్ద అడిశర్లపల్లి:** కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు.. అబద్ధపు ప్రచారాలు చేస్తూ పార్టీపై ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న ప్రతిపక్ష పార్టీలకు దిమ్మతిరిగే సమాధానం ఇవ్వాలని అందుకు మీ గ్రామంలో ఉన్న సోషల్ మీడియా కోఆర్డినెటర్లను ప్రోత్సహించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.పిఏ పల్లి మండల పరిధిలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ కుటుంబ శ్రేణులు ఏర్పాటు చేసిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లడుతు గత ఎన్నికల్లో మహిళల పాత్ర చాలా కీలకం, ఈ సారి లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందాలంటే మహిళలు కీలక పాత్ర పోషించాలన్నారు.గ్రామస్థాయిలో ఉన్న మహిళా నాయకులను ప్రోత్సహించండి, పార్టీ బలోపేతానికి కృషి,పార్టీ కోసం మీరు చేస్తున్న త్యాగాలు చూపిస్తున్న ఆదరణ ఇలాగే కొనసాగించాలని నియోజకవర్గంలో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చూపిన విధంగా విజయడంక మోగించి, పిఏ పల్లి మండలంలో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపుకై ప్రతి కార్యకర్త సైనికులు వలె నిలబడాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య యాదవ్,బ్లాక్ అధ్యక్షులు బొడియా నాయక్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి,మాజి ఎంపిపి ప్రతాప్ రెడ్డి,సీనియర్ నాయకులు కాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండల్,లచ్చి రెడ్డి,తెర సత్యం రెడ్డి,డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అడేపు సతీష్ మాదిగ,యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

### ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి

**ప్రజాపక్షం/మునగాల:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతం కోసం అటు శాసన మండలిలో, బయట శక్తివంచనలేకుండా కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఉపాధ్యాయ శాసనమండలిలో సభ్యునిగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు తన వంతు పాత్రని పోషించానని, దీనిలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల, గురుకుల, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీల విషయంలో తాను న్యాయం పోరాటం సైతం నిర్వహించి, ప్రభుత్వాన్ని ఒప్పించి బదిలీల సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. తనకు మరో సారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో యూటిఎఫ్ నాయకులు కెఎ మంగా, ధనమూర్తి, స్థానిక ఎంఇవో పిడతల వెంకటేశ్వర్లు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్ పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలో సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు లక్షల పైబడి రుణం తీసుకున్న వారు పై పైసలు బ్యాంకులలో చెల్లిస్తే వారి అకౌంట్లల్లో రెండు లక్షలు జమ చేస్తామని ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో చెప్పడం జరిగిందని గుర్తుచేశారు. అలాగే రైతుబరోసా ఎకరానికి రూ.7500 చెల్లిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు రూ. 6 వేలను ఇస్తమని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. వానాకాలం,యాసంగిలకు కలిపి రూ. 15 వేలను రైతుభరోసాగా అకౌంట్లల్లో వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య,యడ్ల అంజిరెడ్డి, చేవ వెంకన్న,కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు,షేక్ నభిసాహెబ్,పందిరి సైదులు పాల్గొన్నారు.



## వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడి అవర్స్ నిర్వహించాలన్నారు. ఆయన తొమ్మిదవ తరగతి విద్యార్థుల తెలుగు చూచిరాత కాపీని చూసి మంచిగా రాసిన విద్యార్థులను అభినందించారు. పలువురు విద్యార్థులకు తెలుగుపాఠం చదివించారు. ఆట స్థలంలో మాక్ డ్రిల్ ప్రాక్టిస్ చేస్తున్న 6వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి మధ్యాహ్న భోజనం ఏలా పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏమైన సమస్యలు ఉంటే ఉపాధ్యాయులు తెలియపర్చాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ శాంతయ్య, ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్, ఉపాధ్యాయులు లక్ష్మణ్ నాయక్, దుర్గ ప్రసాద్, నరసయ్య ఉన్నారు.

## డ్రైవర్ల అతివేగంతోనే అధిక ప్రమాదాలు




**ప్రజాపక్షం/సూర్యాపేట:** డ్రైవర్లు అతివేగంగా వాహనాలు నడపడంతోనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ అధికారి సురేష్ రెడ్డి అన్నారు. మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సూర్యాపేట హైటెక్ బస్టాండ్ ఫోర్ వీలర్స్ యూనియన్ అధ్యక్షులు మరికంటి అంబేద్కర్ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ వద్ద డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాల్లో చినిపోతున్నారని డబ్ల్యూహెచ్ఓ ద్వారా తెలుసుకొని కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆ మరణాలను నివారించేందుకు రోడ్డు భద్రత వారోత్సవాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు, సిగ్నల్స్‌ను పాటించాలన్నారు. ఎంవిఐ జయప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వాహనాలు నడిపి సమయంలో డ్రైవర్లు ఓపికగా ఉండాలని, వేగం కన్న ప్రాణం ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, ప్రసాద్, వెంకన్న, ఉదయ్ రెడ్డి, పేరుమాళ్ళ అంబేద్కర్, కోటాచారి, పిల్లల శ్రీను పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

**ప్రజాపక్షం/తిరుమలగిరి:** ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్‌లు అన్నారు. మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ చాగంటి అనసూర్యరాములు అధ్యక్షతన జరిగిన సాదారణ సమావేశంలో వారు మాట్లాడారు. తిరుమలగిరి మున్సిపాలిటి అభివృద్దే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు రాజకీయ విబేదాలను పక్కకు పెట్టి ముందుకు సాగాలన్నారు. మున్సిపల్ సిబ్బందికి ప్రమాద వశాత్తు మణిస్తే రూ. 5లక్షల ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పెండింగ్‌లోని వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి ముందు మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకట మణికరణ్, తహసీల్దార్ హరిప్రసాద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీధర్‌తో పాటు కౌన్సిలర్లు ఎల్సోజు నరేష్, రఘునందన్ రెడ్డి, భాస్కర్ నాయక్, బత్తుల శ్రీను పాల్గొన్నారు.





## తపాలశాఖ జీవిత బీమా పథకాలను సద్వినియోగం

ప్రజాపక్షం/మునగాల: తపాల శాఖ జీవిత బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా జీవిత భీమా అభివృద్ధి అధికారి జింజిరాల సైదులు అన్నారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణి గ్రామంలో తపాలశాఖ వారి ఆధ్వర్యంలో జీవిత బీమా పాలసిలపై, ఆర్పీఎల్ఐ, పిఎల్ఐ మహా ర్యాలీని ర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలశాఖలో జీవిత బీమాలో చేరితే పాలసీ, ఇన్సూరెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మునగాల ఎస్పీఎం దయాకర్, కొక్కిరేణి బ్రాంచ్ పోస్టుమాస్టర్ నరహరి, సనీల్, అన్ని బ్రాంచుల పోస్టుమాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యాలయంపై దాడి హేయమైన చర్య

ప్రజాపక్షం/చిట్యాలః రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని బిజెపి కార్యాలయంపై దూసుకెళ్ళి నాయకులపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య అని బిజెపి రాష్ట్ర నాయకులు కూనూరు సంజయ్‌దాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడి సంఘటనలో బిజెపి నాయకులు, కార్యకర్తలు గాయపడ్డారని, ప్రత్యక్ష దాడులకు దిగి భయభ్రాంతులకు గురి చేసిన కాంగ్రెస్ వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల వాగ్దానంలోని ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయడం చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చౌకబారు చేష్టలకు పాల్పడుతుందని విమర్శించారు. ఇలాంటి సంఘటనలు పునర్వృతం కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చూసుకోవాలని సంజయ్‌దాస్ డిమాండ్ చేశారు.

## దాడిని సహించేది లేదు



ప్రజాపక్షం/చండూరుః హైదరాబాద్‌లోని బిజెపి కార్యాలయంపై, పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ చేసిన దాడిని సహించేదిలేదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి నకిరెకంటి లింగస్వామి గౌడ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన చండూరులో మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలపై కాంగ్రెస్ చేసిన దాడి అనైతిక బలహీనతకు నిదర్శనం అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ,రౌడియిజాన్ని అంతమొందించటానికి బిజెపి నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: మండలంలోని దాతరుపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వలు రకాలైన జనరల్ పరీక్షలు చేసి, మందులను అందజేశారు. అవసరమైన ఆపరేషన్లకు ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిని రాజు, ముదిగొండ సుధాకర్, లయన్స్ క్లబ్ క్రిష్ణ ప్రసాద్, క్రిష్టారెడ్డి, శేఖర్ రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: నిరవధిక సమ్మె చేపట్టిన సివిల్ సప్లయ్ హమాలీల పక్షాన భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖా మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిలిచినందుకు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌లు ధన్యవాదములు తెలియజేశారు. మంగళవారం సివిల్ సప్లయ్ హమాలీల కూలీ రేట్లు పంచుతూ ప్రభుత్వం సంసిద్ధం వ్యక్తం చేయగా సమ్మెను విరమించారు. హుజూర్‌నగర్‌లోని సమ్మె దీక్షాశిభిరం వద్ద మిఠాయిలు పంపిణీ చేసుకుని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జరిపిన చర్చలకు అనుగుణంగా సివిల్ సప్లయ్ హమాలీలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు యల్లావుల రమేష్,మామిడి వెంకయ్య, జక్కుల శ్రీనివాస్,హమాలీ సంఘం నాయకులు భానోతు సైదులు,పండుగ వెంకన్న,జక్కుల మల్లయ్య, బాలాజీ,శీలం వెంకన్న,తోట లక్ష్మయ్య, చింతకాయల పిచ్చయ్య,చింతకాయల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన



ప్రజాపక్షం/తుంగతుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని బిఆర్ఎస్ నేతలు మంగళవారం మండలంలోని రామన్నగూడెం తండాలో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రూ. 2లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేటికి వేలాది మంది రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 15వేలు ఇస్తామని చెప్పి నేడు రూ. 12 ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గుండగాని రాములు గౌడ్, మాజీ ఎంపిటిసిలు గాజుల యాదగిరి, ఆంగోతు సురేష్ నాయక్, మాజీ సర్పంచ్ కాంతమ్మ రాములు నాయక్, ఈరా నాయక్, సేవ్యా, బాలు, రవి, ధర్మా పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశికి ముస్తాబవుతున్న వేంకటేశ్వరస్వామి



ప్రజాపక్షం/మునగాల: మునగాల మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ ఆలయంలో వేంకటేశ్వరస్వామి స్వయంభుగా దక్షణ తలాపు చేసి ఉత్తరాభిముఖంగా దర్శనమిస్తుండటంతో ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయం అని పెద్దలు చెబుతుంటారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. స్వామి వారు స్వయంభుగా వెలిసినందున ఇది దేశంలోని ఆరుద్దైన క్షేత్రమని స్థానికులు చెబుతుంటారు. వేంకటేశ్వరస్వామి లక్ష్మి నర్సింహ స్వామి, కొలువైనందు వల్ల ఈ ఆలయం భక్తుల పాలిటి కొంగు బంగారంగా తెలుగింటి వారి ఇలవేల్పుగా పూజలందుకు భక్తుల హృదయాల్లో కొలువుదీరి విరాజిల్లుతుంది.

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారంః జూలకంటి




ప్రజాపక్షం/చిట్యాలః ఎర్ర జెండా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో మంగళవారం జరిగిన పార్టీ జిల్లా కమిటి సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనన్నారు. దేశానికి ఎర్ర జెండా అవసరమని, ఎర్రజెండా బలహీన పడితే దేశ ప్రజలకే ప్రమాదమన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ పాత విధానాలే అవలంభిస్తున్నారని, ప్రజా సమస్యలు పరిష్కరించడం చేతకాక ప్రజల దృష్టిని మళ్ళించేందుకు జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకువస్తున్నారని విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎర్ర జెండాను గెలిపించడానికి కార్యకర్తలు, నాయకులు సమాయత్తం కావాలని రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు నారి ఐలయ్య, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, లక్ష్మి నారాయణ, పాలడుగు నాగార్జున, ప్రభావతి, వీరెపల్లి వెంకటేశ్వర్లు, బండ శ్రీశైలం, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాన్‌బోస్కో వర్ధంతి మాసం



ప్రజాపక్షం/చండూరుః జనవరి 31 డాన్‌బోస్కో వర్ధంతిని పురస్కరించుకొని డాన్‌బోస్కో మాసం లో విద్యార్థులకు ఆటలు పాటలు కళలు సాహిత్యం వంటి వివిధ రంగాలలో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ రాజేష్ క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బాలశౌరి రెడ్డి,డాన్‌బోస్కో దిశా సంస్థ కోఆర్డినేటర్ ఫాదర్ జస్టిస్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికను మంగళవారం దేవర కొండలోని బంజారా భవన్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కుర్ర కృష్ణకాంత్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా కెతావత్ పంతునాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాము నిరంతరం కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కెతావత్ గోవింద్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ మోతీలాల్‌నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఎన్నికకు ముఖ్య అతిథులుగా టీజీయుఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బాణావత్ సైదులునాయక్, ఉపాధ్యక్షుడు మూడ్ తిరుపతినాయక్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హేమానాయక్, టాక్రు, మల్లేష్, గిరి, మోతిలాల్, చందు, సురేందర్, కోటేష్, లక్కునాయక్, శంకర్‌నాయక్, తులసీ పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: శీతాకాలంలో పేదలు చలికి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతో స్థానిక విశ్వాసర పరిచర్య ప్రార్థన మందిరం పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ మంగళవారం పేదలకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారని దాతలు పేదలకు దుప్పట్లు పంపిణి చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రమాబాయి, దీనమ్మ, రాములు, వెంకటమ్మ, ఎలీషమ్మ, రూతమ్మ, జ్ఞానమ్మ, లాజరు పాల్గొన్నారు.

## సింహాసన పాశురం పూజలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ధనుర్మాస వేడుకల్లో భాగంగా పట్టణంలోని రైల్వే కాలనీ శ్రీసాయి దత్త ఆశ్రమంలోని శ్రీఅష్టలక్ష్మి మందిరంలో మంగళవారం సింహాసన పాశురం నిర్వహించారు. రంగనాథ స్వాముల వారిని సింహాసనంపై అలంకరించారు. పట్ట ణ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తిరుప్పావై పారాయణం చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి మట్టయ్య, జానకిరాము దు, శ్రీనివాసబాబు, విక్రమ్, పద్మ, భవాని, కల్యాణి, సుకన్య పాల్గొన్నారు.

## రామాలయంలో హనుమాన్ చాలీసా

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః హుజూర్‌నగర్ పట్టణంలోని అతి పురాతనమైన శ్రీవేణుగోపాలసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలల్లో భాగంగా మంగళవారం 108 మంది మహిళలు,108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. దేవాలయంలో ఉన్నటువంటి ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను మండపంలో భద్రపీఠంపై వేంచేసి,తమలపాకులతో అరటి పండ్లతో పూజ కార్యక్రమాలు చేశారు. మహిళలందరికీ హుజూర్‌నగర్ బార్‌అసోసియేషన్ అధ్యక్షులు సాముల రాంరెడ్డి విజయలక్ష్మి దంపతులు హనుమాన్ కందువాలను అందించారు. ఈ కార్యక్రమంలో అలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి,వంకాయల పద్మ,మాధవరావు,సువర్ణ,భారతమ్మ,కృష్ణవేణి, సుజాత,పిచ్చమ్మ, విజయలక్ష్మి,పద్మ తదితరులు పాల్గొన్నారు.



## చందుపట్ల మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ అనారోగ్యంతో మృతి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్** : భువనగిరి మండలంలోని గౌస్‌నగర్ గ్రామానికి చెందిన ఎలిమినేటి మల్లారెడ్డి అనారోగ్యంతో సోమవారం సాయంత్రం హైదరాబాదులోని చెంపపేట గ్లోబల్ ఆస్పత్రిలో మృతి చెందారు. కాగా ఈయన ప్రస్తుతం చందుపట్ల బ్యాంకు చైర్మన్, వైస్ చైర్మన్‌గా కొద్ది రోజులు సేవలందించారు. అతని కుమారుడు అమెరికాలో ఉండటం వలన అంత్యక్రియలు ఈనెల 9వ (తొమ్మిదవ) తేదీన గౌస్‌నగర్ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసినవాళ్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల మాస రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ ఈర్ల కృష్ణ, నాయకుడు పాశం రామ్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పాక వెంకటేష్ యాదవ్, సాయి రెడ్డి పోస్ట్ రెడ్డి ఉన్నారు.

## హమాలీల సమ్మె విరమణ



**ప్రజాపక్షం/ రామన్నపేట:** రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు పెంచిన కూలీరేట్ల జీవోను విడుదల చేయాలని చేస్తున్న సమ్మె పట్ల పౌర సఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, హమాలీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమయ్యలతో కూడిన ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో మంత్రి సానుకూలంగా స్పందించి రెండు రోజుల్లో జీవోను విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో మంగళవారం సమ్మెను విరమిస్తున్నట్లు హమాలీ కార్మికుల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి, పట్టణ సీపీఐ కార్యదర్శి, ఏఐటీయూసీ నాయకులు శివరాత్రి సమ్మయ్య, చేనేత కార్మిక సంఘం నాయకులు రచ్చ యాదగిరి, సివిల్ సప్లయ్, హమాలీ కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులు గొరిగె నరసింహ, గొరిగె శంకరయ్య, తోటకూరి అంజయ్య, బండ స్వామి, నరేష్, గొరిగె రవి, పల్లె ఉపేందర్, ఏనుగు చాలు, కొండే పరుశురాములు, లింగస్వామి, వేణు, శ్రీను, ఆనంద్, స్వామి, పెంటయ్య, బోడ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్



**ప్రజాపక్షం/వలిగొండ** : గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామన్నపేట అంబేద్కర్ జంక్షన్ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా, చిట్యాల వైపు నుండి వలిగొండ వైపుగా హోండా షైన్ బైక్ మీద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తుండగా, వారిని పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద 3,760 గ్రాముల గంజాయి ఉన్నట్లు తెలిపారు. నిందితులు రామన్నపేట మండలం తుమ్మల గూడెం గ్రామానికి చెందిన కుంచం విజయ్ కుమార్, డిగ్రీ విద్యార్థి, వలిగొండ మండల కేంద్రంలో స్క్రాప్ వ్యాపారం చేస్తున్న సిరిగిరి బోయజ్ రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు, రామన్నపేట సిఐ ఉత్తర్వుల మేరకు కేసు దర్యాప్తును చేపట్టి ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తప్పించుకు పారిపోయిన వలిగొండ మండలం సోమారానికి చెందిన దుర్గా ప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## తహసీల్దార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/అనంతగిరి:** వారసత్వంగా ఉన్న ఆస్తిని కుటుంబ సభ్యుల అభిప్రాయం లేకుండా అక్రమంగా ఆరు ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసిన అనంతగిరి తహసిల్దార్ హిమబిందుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనంతగిరి మండల పరిధిలోని గొండ్రియాల గ్రామానికి చెందిన నెలకుర్తి ఉషారాణి ఆర్డీవో సూర్య నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ అక్రమ రిజిస్ట్రేషన్‌లో తహసిల్దార్ అత్యుత్సాహం ప్రదర్శించి నిబంధనలకు విరుద్ధంగా పట్టా జారీ చేసిందని, రిజిస్ట్రేషన్‌కి ముందే కుటుంబ సభ్యుల అభిప్రాయం తీసుకున్న తర్వాతే రిజిస్ట్రేషన్ చేయాలని పిర్యాదు చేసిన తహసిల్దార్ చేతివాటం ప్రదర్శించిందని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన తహసిల్దార్‌ను సస్పెండ్ చేయాలని కోరారు.

## పర్యావరణానికి హాని కలిగించే మిల్లులను మూసివేయాలి



**ప్రజాపక్షం/కోదాడ:** పర్యావరణానికి హాని కలిగించే మిల్లులను వెంటనే మూసివేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాదు ఆరోపించారు. రైస్ మిల్లుల నుండి వెలువడే కాలుష్యం నుండి తమను కాపాడాలని కోదాడ మున్సిపాలిటి పరిధిలోని తమ్మర, లక్ష్మీపురం కాలనీ ప్రజలు మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్, నల్లగొండ పొల్యూషన్ బోర్డు అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బొల్లు ప్రసాదు మాట్లాడుతూ కోదాడ ఖమ్మం జాతీయ రహదారిని అనుకొని ఉన్న శ్రీలక్ష్మి శ్రీనివాస, రాధకృష్ణ, రాజ్యలక్ష్మి ఇండస్ట్రీ పార్ బాయిల్డ్ రైస్ మిల్లుల నుంచి మురుగునీరు, బూడిద, వ్యర్ధ పదార్థాలతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, శ్వాస కోస సమస్యలు తలెత్తుతున్నాయని, రహదారిపై వాహనదారులకు కళ్లలో బూడిద పడి అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని అన్నారు. తాము మిల్లుల యాజమానులను కలిసి ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించడంలేదని అన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మిల్లులను మూసివేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిరాపురపు హేమ, సట్టు వీరస్వామి, వెలిదే పద్మ, సాంబశివరావు తదితరులున్నారు.

## భూమిలేని నిరుపేదలను వ్యవసాయ కూలీలుగా గుర్తించాలి




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అఖిలపక్ష కమిటీ సమావేశంలో హాజరై సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలను వ్యవసాయ కూలీలుగా గుర్తించి ప్రభుత్వం గుర్తించిన భూమిలేని నిరుపేదలకు రూ.12 వేలు ఆర్థిక సహాయంగా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్ఆర్ఈజీఎస్‌తో సంబంధం లేకుండా సమానంగా గ్రామీణ ప్రాంతాలలో ఉండే నిరుపేదలను గుర్తించినట్లయితే దారిద్ర రేఖకు దిగువన ఉన్న పేదలను గుర్తించినట్లు ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చింతకాయల నరసింహ, తుమ్మల నర్సిరెడ్డి, పల్లె మల్లారెడ్డి, గుంటోజు శ్రీనివాస చారి, గాజుల అంజయ్య, చిలువేరు బిక్షం, కుక్కల అంజయ్య, శ్రీరాముల నరసింహ, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వినూత్నంగా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** జాతీయరోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని నల్లబండగూడెం వద్ద గల అంతరాష్ట్ర రవాణాశాఖ చెక్ పోస్టు వద్ద వాహనదారులకు, డ్రైవర్లకు వినూత్న పద్ధతిలో నియమాలను పాటించాలంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖ అధికారి సురేష్‌రెడ్డి పాల్గొని కారు డ్రైవర్లు తప్పని సరిగా సీటుబెల్టు ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ ధరించాలని కోరుతూ వారికి పువ్వులను అందజేశారు. భద్రత నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయని సూచించారు. ఒక వ్యక్తి లేదా, వ్యక్తులు వాహనాలు నడిపే సమయంలో చేసే తప్పిదాలు కొన్ని కుటుంబాలు వీధినపడే అవకాశాలున్నాయని అన్నారు. వాహనాలను వినియోగించే క్రమంలో జాగ్రత్తలు పాటించి సంబంధిత ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ షేక్ రాజ మహ్మద్, కె. శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయిప్రసాదు, కానిస్టేబుల్ చిన్నిబాబు, దేవేందర్, జానకిరామ్, నాగరాజు, రాజకుమార్, సైబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె తాత్కాలికంగా వాయిదా

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓకి, జిల్లా విద్యా శాఖ అధికారి కి సమాచారం అందించి విధుల్లో చేరుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మోలుగూరి కృష్ణ, బొమ్మగాని రాజులు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విభాగాల ఉద్యోగులకు సహకరించిన పోలీస్ శాఖ,అన్ని రకాల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు, ప్రజాసంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు గత నెల 10వ తేదీ నుండి ఈ నెల 06 వరకు 28 రోజులు కొనసాగిన నిరవధిక సమ్మెకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



## సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సిపిఎం రాష్ట్ర నాల్గవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ భవన్‌లో నిర్వహించిన సిపిఎం టూ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలని ఢిల్లీలో రైతులు ఉద్యమిస్తుంటే మోడీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్‌లో నిర్వహించే కార్యచరణను రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో టూ టౌన్ కమిటీ కార్యదర్శి పిండిగ నాగమణి, సభ్యులు బోళ్ళ వెంకట్ రెడ్డి, బత్తుల వెంకన్న, ఉయ్యాల నగేష్, ముక్కెర్ల వెంకన్న, శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం కఠిన చర్యలు

**ప్రజాపక్షం/సూర్యాపేట(పెన్‌పహాడ్):** గ్రామ పంచాయతీ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెన్‌పహాడ్, అనంతారం, సింగిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆయా గ్రామపంచాయతీల రికార్డులు, నర్సరీల పనితీరు, సెగ్రిగేషన్ షెడ్ వాడుతున్న విధానాన్ని, వైకుంఠదామంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుద్య పనులను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను సూచించారు. రానున్న వేసవికాలంలో నర్సరీలను సురక్షితంగా ఉంచడంతో పాటు తాగునీటి సమస్య లేకుండా ప్రణాళికలను రూపొందించాలన్నారు. మండల పంచాయతీ అధికారి సంజీవయ్య, గ్రామపంచాయతీల కార్యదర్శులు నాగరాజు, సోమయ్య, అఖిల్, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు బేగం, సిబ్బంది శ్రవణ్, విఘ్నేష్ పాల్గొన్నారు.



## అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారు

**ప్రజాపక్షం/గుండాల:** రాష్ట్రంలో అధికారం చేలాయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని ఆలేరు మాజీ ఎంఎల్‌ఏ బూడిద బిక్షమయ్య గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అమలుకు నోచుకోని హామీలను ప్రజల ముందు పెట్టి ప్రజలను మోసం చేసే ఉద్దేశ్యంతోనే ఓట్లు దండుకొని తీరా అధికారం చేతికి వచ్చాక ఎన్నిక ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చలేక తెల్లమోహం వేసిందని విమర్శించారు.



తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నేరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## బిఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దు

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: బిఆర్ఎస్ కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడవద్దని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. పార్టీలో చురుకుగా పనిచేసి రోడ్డు ప్రమాదంలో మరణించిన మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన భూతరాజు సురేష్ కుటుంబానికి పార్టీ నుండి వచ్చిన రూ. 2లక్షల ప్రమాద బీమా చెక్కును మాజీ ఎంఎల్ఎ రవీంద్రకుమార్ కార్యకర్తలతో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రైబసా మాజీ అధ్యక్షులు కేసాని లింగా రెడ్డి, రావుల వెంకటయ్య, రావుల వెంకన్న, భూత రాజు సైదులు, కృష్ణయ్య, బాలు, రాజేష్ పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ హవా చూపాలి



ప్రజాపక్షం /నార్కట్ పల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్ హవా చూపాలని, పార్టీ బలోపేతానికి నిరంతరంగా కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్‌రావు అన్నారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తో కలిసి పార్టీ మండల యువజన నాయకుడు పుల్లలం వెంకట్ గౌడ్ కెసిఆర్‌ను ఎర్రవెల్లిలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## మాడుగులపల్లి గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిబిరం

ప్రజాపక్షం/ మాడుగులపల్లి: మాడుగుల పల్లి గ్రామంలోని తెలంగాణ ప్రభుత్వ పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పశు వైద్య శిబిరం బుధవారం ఏర్పాటు చేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలికంగా ఎదకురాని పశువులను ప్రత్యేకంగా గర్భాన్ని పరిశీలించి గర్భకోశ చికిత్స చేయబడునని, చూడు నిలవని పశువులను ప్రత్యేకంగా గర్భాన్ని పరిశీలించి చికిత్స చేయబడునని ఇంకా ఏ విధమైన ఆరోగ్య సమస్యలు గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలలో ఉన్నచో పరీక్ష చేసి చికిత్స చేయబడునని ఇట్టి పశువులని పశువుల హాస్పిటల్ కార్యాలయం ఆవరణలో ఉన్న ట్రెవిస్ ( పశువుల బోను ) దగ్గరికి తీసుకొని రాగలరని డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు.

## ప్రతి వాహనదారుడు సురక్షితంగా గమ్యం చేరాలి




ప్రజాపక్షం/దేవరకొండ : రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ఏ ఒక్కరికి హాని తలపెట్టకుండా ప్రతి వాహన దారుడు గమ్యం చేరేలా రోడ్డు భద్రతా నిభందనలు పాటించాలని దేవరకొండ ఏఎస్పి పి. మౌనిక సూచించారు. మంగళవారం దేవరకొండ ఆర్టిసి డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దేవరకొండ ఏఎస్పి మౌనిక హాజరై మాట్లాడారు. డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చాలా పెద్ద బాధ్యత మీపై ఉందని అన్నారు. డ్రైవర్లకు మానసిక ఒత్తిడి ఉంటుందని, అయినప్పటికి దృఢంగా ఉంటూ డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటించి ప్రయాణికులను గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే మీ కుటుంబంతో పాటు ఎదుటి వారి కుటుంబాలు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు. దేవరకొండ డిపో పరిధిలో గతంతో పోలిస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గాయని అన్నారు. డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ, ప్రయాణికులను సురక్షితంగా తరలించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిపో మేనేజర్ రమేష్‌బాబు, సిఐ నర్సింహులు, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, ఎంఎఫ్ కృష్ణయ్య, వేల్ఫేర్ బోర్డు మెంబర్ పాపారాజు, సమద్, సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకుల స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాపక్షం /నార్కట్ పల్లి : మండలంలోని చౌడంపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురుకుల స్టడీ మెటీరియల్ ను ఆసరా స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి హరికృష్ణ అందజేశారు. 2025 26 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి లో చేరేందుకు ఫిబ్రవరి 23న తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న వి.టిజీ సెట్ గురుకుల ప్రవేశ పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు స్వంత ఖర్చులతో కొనుగోలు చేసి ఆయన అందించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలుగుబెల్లి శ్రీలత,ఉపాధ్యాయుడు యాచరం రమణభార్గవ్ పాల్గొన్నారు.



## మెస్ మెనూపై అసత్య ప్రచారాలు చేయొద్దు

ప్రజాపక్షం /నార్కట్ పల్లి : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం కృష్ణవేణి వసతి గృహంలో కారంతో భోజనం వడ్డిస్తున్నట్లుగా ఉన్నత అధికారులకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో విశ్వవిద్యాలయ అధికారులు సంఘటనను మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ దోమల రమేష్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సాంబారు కళ్యాణి నేతృత్వంలో, వార్డెన్లు రాజేశ్వరి,డాక్టర్ జ్యోతి ప్రత్యక్షంగా వసతి గృహానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినులు హాస్టల్ వర్కర్స్ తో చర్చించిన అనంతరం జరిగిన వివాదంపై వివరణ ఇస్తూ బాలికల హాస్టల్ పూర్తిగా విద్యార్థినుల భాగస్వామ్యంతో వారి నచ్చిన మెనూ ప్రకారమే నిర్వహణ జరుగుతుందని, అల్పాహారంగా బొండాలు ఇవ్వగా కొందరి తల్లిదండ్రులు అయ్యప్ప దీక్షల కారణంగా వెల్లుల్లి లాంటి వాటికి స్వచ్ఛందంగా దూరంగా ఉన్నట్లు, వారే స్వయంగా కోరిన నేపథ్యంలో కారం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. బీటెక్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో వారికోసం సిద్ధపరచిన భోజనాన్ని కొందరు విద్యార్థినులు వారి ఇష్ట ప్రకారమే కారంతో తీసుకున్నట్లు తెలిపారన్నారు. జరిగిన సంఘటనపై విద్యార్థినులు, హాస్టల్స్ వర్కర్స్ లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చినట్లు తెలిపారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం



ప్రజాపక్షం/భువనగిరి: కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యుఐ గుండాల నాయకులు నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయం పై చేసిన దాడికి నిరసనగా భువనగిరిలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరామ్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు జన్నంపల్లి శ్యాంసుందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్త మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలు తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయం పై దాడి చేయడం సిగ్గుచేటు అని తెలంగాణలో అధికారంలోకి వచ్చి ప్రజలకు హామీలు ఇచ్చి నెరవేర్చకపోగా వీధి రౌడీల్లాగా వ్యవహరిస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రోజుకొక మాట వేశం వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, పదరాజు ఉమా శంకర్ రావు, కౌన్సిలర్‌లు ఉదయగిరి విజయ్ కుమార్, ఉదరి లక్ష్మీ సతీష్, జనగాం కవిత నరసింహచారి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, నీలం రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు రాళ్లబండి కృష్ణచారి, రత్నపురం శ్రీశైలం, ఎంగిలి లక్ష్మణ్, యాట వెంకట్, సంతోష్ పాల్గొన్నారు.



## ఫిబ్రవరి 15 సెలవు దినంగా ప్రకటించాలి

ప్రజాపక్షం/భువనగిరిరూరల్: వచ్చేనెల ఫిబ్రవరి 15న శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉన్నందున తెలంగాణా రాష్ట్ర గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని సెలవు దినంగా ప్రకటించి, ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల గిరిజన గోర్ సేన ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఎం.హన్మంతు రావుకు కలిసి వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా ప్రతి గిరిజన తండాలో ఇంటింటికి కుల దైవంగా బోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోర్ సేన జిల్లా ఉపాధ్యక్షులు దిరావత్ రవి నాయక్, దిరావత్ వెంకటేష్ నాయక్, బానోత్ నరేందర్ నాయక్, గూగులోత్ నరేందర్ నాయక్, రామావత్ వీరన్న నాయక్, గుగులోత్ వెంకటేష్ నాయక్, బానోత్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

## కామారెడ్డి బిసి డిక్లరేషన్ను అమలు చేయాలి



ప్రజాపక్షం/భువనగిరి: కామారెడ్డి బిసి డిక్లరేషన్ను వెంటనే అమలు చెయ్యాలని మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఓబీసీ పట్టణ అధ్యక్షులు కట్కమోజు ఉషాకిరణ్ ఆధ్వర్యంలో బిసి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని ఇన్చార్జి ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, ఓబీసీ జిల్లా అధ్యక్షులు దుర్గాపతి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీల్లో భాగంగా కామారెడ్డి బహిరంగ సభలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, పదరాజు ఉమా శంకర్ రావు, నీలం రమేష్, ఆకుతోట రాము, పట్టణ అధ్యక్షులు రత్నాపురం బలరామ్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కృష్ణచారి పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను కలిసిన ముత్యాలు



ప్రజాపక్షం/డిండి: డిండి మండలంలోని వావిల్‌కోల్ గ్రామ పరిధిలోని వద్దర గూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి ఓర్సు అంజయ్య కుమారుడు బిఆర్ఎస్ మండల నాయకులు ఓర్సు ముత్యాలు ఎర్రబెల్లి లోని ఫామ్ హౌస్‌లో మాజీ సిఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సిఎం కేసీఆర్ మాట్లాడుతూ డిండి మండలంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రానున్న స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి విజయం కోసం అందరూ కలిసి పనిచేయాలని సూచించినట్లు ముత్యాలు తెలిపారు.మరల అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండాలని పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని కేసీఆర్ సూచించారని తెలిపారు.

## దాడుల సంస్కృతి సరికాదు

ప్రజాపక్షం/డిండి: బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంపై మంగళవారం కాంగ్రెస్ పార్టీ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని ప్రజాస్వామ్యంలో దాడుల సంస్కృతికి సిఎం రేవంత్‌రెడ్డి తెరలేపడం సమంజసం కాదని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరసన పేరుతో కాంగ్రెస్ వీధి రౌడీలను తీసుకువచ్చి బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంపై హైదరాబాద్‌లో దాడి చేసి బిజెపి కార్యకర్తలను తీవ్రంగా గాయపరచడం చూస్తుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారన్నారు.

## ఎఇలుగా ఎంపికయిన చంద్రశేఖర్, మనీషా

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి యాదగిరి యాదమ్మ దంపతుల ద్వితీయ కుమారుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్, మంత్ర్యతండాకు చెందిన రమావత్ వస్త్రాం శారద దంపతుల కుమార్తె రమావత్ మనీషాలు జెన్‌కో ఏఈలుగా ఎంపికై నియామక పత్రాలు అందుకున్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత నిరుపేద కుటుంబాల నుండి ఉమ్మడి కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధి నుండి ఇద్దరు ఒకే సారి ఏఈలుగా ఉద్యోగం సాధించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు వారిని అభినందించారు.





# ఇంటర్ ఫలితాల బాధ్యత అధ్యాపకులదే

## ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి భీంసింగ్



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్):** ఇంటర్మీడియట్ పరీక్ష ఉత్తమ ఫలితాలు సాధించే బాధ్యత అధ్యాపకులదేనని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరి, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి భీంసింగ్ అన్నారు. మంగళవారం జిల్లా పర్యాటనలో భాగంగా మండలంలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సందర్శించిన ఆయన 90 రోజుల ప్రణాళికలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థుల అధ్యాయన పద్దతులను నేరుగా విద్యార్థులతో మమేకమై తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోని నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కళాశాలలకు రాని విద్యార్థుల పట్ల చొరవ తీసుకొని వారి తల్లిదండ్రులకు ఫోన్‌ల ద్వారా సమాచారం అందించి కళాశాలకు రప్పించాలన్నారు. అవసరమైతే ఎక్కువమంది ఉన్న గ్రామాలకు తరలి వెళ్లి డ్రాప్ అవుట్ విద్యార్థులను కళాశాలకు హాజరు అయ్యేలా చూడాలన్నారు. మార్చిలో జరిగే పరీక్షలను దృష్టిలో పెట్టుకోని ప్రతి రోజు ప్రణాళికబద్దంగా చదివించాలన్నారు. దీని ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్య తీసుకునే నిర్ణయాలను ప్రతి కళాశాలలో ఆచరించి బలోపేతానికి కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సుదూర ప్రాంతాలకు కార్పొరేట్ కళాశాలలకు వెళ్లడంతో ఆర్థికంగా నష్టపోతారని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల బలోపేతమే ధ్యేయంగా అధికారులు పని చేయాలన్నారు. రాష్ట్రంలోని 420 కళాశాలలో ప్రధానాచార్యులను హైద్రాబాద్‌లో సమావేశపరిచి పలు సూచనలు చేయడం జరిగిందని, వాటిని అమలు చేస్తున్న తీరు తెన్నలను పరిశీలించడానికి ఒక అధికారిని నియమించినట్లు చెప్పారు. విద్యార్థుల నుంచి కళాశాలలకు కావాల్సిన వసతులను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకుల రోజువారి టీచింగ్ డైరీ, విద్యార్థుల హాజరు పట్టిక, మార్కుల ఫలితాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి భాను నాయక్, ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ గునగంటి వెంకటేశ్వర్లు, సీనియర్ అధ్యాపకులు వట్టిపల్లి దశరథ, అధ్యాపకులు పి అశోక్, డి లక్ష్మయ్య, ఎల్ నాగార్జున, లైబ్రేరియన్ గురువార్దె పాల్గొన్నారు.

# ఉద్రిక్తతల మధ్య హమాలీ కార్మికుల సమ్మె విరమణ




**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** నల్లగొండ సివిల్ సప్లై గోదాము వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సివిల్ సప్లై డిఎం,అర్‌డిఓ పోలీసులతో రేషన్ సరఫరా చేయించాలని తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చారు. బయటి హమాలీ కార్మికుల ద్వారానైనా పని జరగాలని ప్రయత్నించారు. ఏఐటియూసి నాయకత్వం హమాలి కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయీస్ జిసిసి హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్ల ఒప్పందం అమలు చేస్తూ వెంటనే జి.ఓ. విడుదల చేయాలని జనవరి 1 నుండి ఈ రోజు వరకు 7 రోజులు జరిగిన రాష్ట్ర వ్యాపితంగా సమ్మెను కొనసాగిస్తుండగా మంగళవారం ఎర్రమంజిలోని జలసౌధ ఇరిగేషన్ శాఖ రాష్ట్ర కార్యాలయంలో పౌరసరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ నాయకులతో కూడిన ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో అక్టోబర్ 4న జరిగిన వేతన ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లను వెంటనే పెంచి అమలు చేయాలని వివరించగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ 2 రోజుల్లో జి.ఓ.ను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా సమ్మెను విరమించాలని కోరారు. దినితో సమ్మె విరమిస్తున్నట్లు ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రకటించారు.గత 7 రోజులుగా ఐక్యంగా సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేసిన సివిల్ హమాలీ సోదరులకు,సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కె ఎస్ రెడ్డి గీత పని వాళ్ళ సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి బి వెంకటేశ్వర్లు జానయ్య బుచ్చయ్య చంటి నాగరాజు లింగయ్య లింగస్వామి యాదయ్య గిరి జానీ రామస్వామి రాంబాబు శివ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంక్షేమ గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, గురుకులాలు విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయాలుగా మారుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం డిఆర్‌వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ మధిర కిష్టాపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి సాయివర్ధన్ మృతిపై పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ప్రభుత్వం గురుకులాలను నిర్వీర్యం చేస్తుందని లక్ష్మణ్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే గురుకులాలు సంక్షోభంలో కూరుకుపోయాయని లక్ష్మణ్ విమర్శించారు. ప్రిన్సిపాల్, వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్లు చెప్పి ఇంత వరకు చేయలేదని వెంటనే వారిని సస్పెండ్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగులమీరా, శివనాయక్, గౌతమ్, జిల్లా నాయకులు రవి, గణేష్, నరేష్ పాల్గొన్నారు.

# సంక్రాంతికి 1030 ప్రత్యేక బస్సులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ నుంచి 1030 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ మంగళవారం తెలిపారు. పండుగ సందర్భంగా ప్రయాణికులు వారి సొంత ప్రాంతాలకు సులభంగా వెళ్లుటకు ఖమ్మం రీజియన్ పరిధిలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బస్సులు నడుపుటకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఈనెల తొమ్మిది నుంచి 20 వరకు 1030 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల తొమ్మిది నుంచి 14 వరకు హైదరాబాద్ నుండి ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని వివిధ ప్రాంతాలకు 585 బస్సులను అదనంగా నడపనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. అదేవిధంగా ఈనెల 15 నుంచి 20 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు నిత్యం తిరిగే బస్సులతో పాటు 445 బస్సులను అదనంగా నడపనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో అత్యధికంగా 135 బస్సులను నడిపేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. బస్సుల సంఖ్యను ప్రయాణికుల రద్దీని బట్టి పెంచడం జరుగుతుందని ఆయన తెలిపారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం గల బస్సులలో టికెట్స్ ఆన్‌లైన్ లేదా దగ్గరలోని బస్టాండ్ టికెట్ రిజర్వేషన్ కౌంటర్, ఏటిబి ఏజెంట్ వద్ద ముందస్తుగా రిజర్వు చేసుకోవచ్చునని తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఈనెల తొమ్మిదిన 40 బస్సులు, 10న 130, 11న 135, 12న 135, 13న 100, 14న 145 మొత్తం రీజియన్ పరిధిలో 585 బస్సులు నడపనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు ఈనెల 15న 125, 16న 120, 17న 80, 18న 60, 19న 60 మొత్తం 445 బస్సులను నడపనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. ఖమ్మం హైదరాబాద్ మధ్య 24 గంటలు నాన్‌స్టాప్ సర్వీసులు నడపబడుతున్నాయని, ఖమ్మం నుండి మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి, కొత్తగూడెం, మధిర, ఇల్లందు తదితర ప్రాంతాలకు బస్సులు ఎల్లవేళల అందుబాటులో ఉంటాయని ఆర్‌ఎం తెలిపారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా సుఖవంతంగా, సౌకర్యవంతంగా ప్రయాణం చేయుటకు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించాలని ఆర్‌ఎం ప్రయాణికులకు సూచించారు. మరిన్ని వివరాలకు ఖమ్మం నూతన బస్టాండ్ సెల్ నెం. 9959225979, ఖమ్మం పాత బస్టాండ్ 9959225965, సత్తుపల్లి 9959225990, మణుగూరు 8985361796, కొత్తగూడెం 9959225982, మధిర 7382925289, భద్రాచలం 9959225987 నెంబర్లను సంప్రదించాలని ఆర్‌ఎం తెలిపారు.



# ప్రజలకు మెరుగైన సేవలు

## మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణశ్రీనివాస్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** నూతనంగా బాధ్యతలు చేపట్టిన వార్డు అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ప్రభుత్వం నియమించిన వార్డు అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కమిషనర్ బి శ్రీనివాస్‌తో కలిసి ఆమె తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయంలోని సెక్షన్ అధికారులు నూతనంగా వచ్చిన వార్డు అధికారులకు నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎన్ కిరణ్, డిఈ సత్యారావు, సానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారి కళ్యాణి, ఎఈ తిరుపతయ్య పాల్గొన్నారు.

# విధిగా హెల్మెట్ ధరిస్తాం...




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వాహనదారులులతో విధిగా హెల్మెట్ ధరిస్తామని పట్టణ ఎస్ఐ ముత్తయ్య ప్రమాణం చేయించారు. మంగళవారం జిల్లా ఎస్‌పి సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా హుజూర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్య పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరించడం వలన కలిగే లాభాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని,వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన ఆర్‌సి,లైసెన్స్‌లు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్,ఉపేందర్,జహీర్,కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ చిల్లర వేషాలు సహించం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** అధికారం ఉందనే అహంకారంతో వీధిరౌడిల్లా కాంగ్రెస్ నాయకుల తీరు ఉందని బిజెపి పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి అన్నారు. మంగళవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఆపార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్ళతో దాడి చేసి బిజెపి కార్యకర్తలను గాయపర్చడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు తలబిరుసుతో ఇలాంటి చిల్లర వేషాలు వేస్తే తమ పార్టీ చూస్తూ ఊర్కోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు,గోపి, లక్ష్మణ్, చారి,నగేష్,మురళీ,నాగరాజు,ఉపేందర్,సింగ్, విజయ్ ,మట్టయ్య,గోపి,సిసీంద్రీ,సాయి తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

**పాల్గొన్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని**





**ప్రజాపక్షం/కొత్తగూడెం:** ఏఐటియుసి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మంగళవారం కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ వేతనాలు రూ.18వేలు పెంపు హామీ ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతంకు అధిక నిధులు కేటాయింపులు చేయాలని, పక్కా భవనాలు, విద్యుత్, మరుగుదొడ్లు, త్రాగునీరు, ఆటబొమ్మలు, రూమ్స్‌లో రంగులు ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చేయాలని అన్నారు. ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్స్, ఇతర పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలన్నారు. మినీ టీచర్స్ పదోన్నతి ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత జీతం రూ.7500ల నుండి రూ.13650లు పెంచి అమలుపరచకుండా గత 9నెలల నుండి మినీ టీచర్ గౌరవ వేతనం మాత్రమే అందిస్తున్నారని అన్నారు. తక్షణమే అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వేతనాలు వెంటనే అందించాలని అన్నారు. కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని, అంగన్‌వాడీ సెంటర్స్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు పెంచాలని అన్నారు ఖాళీగా ఉన్న ఆయా టీచర్ పోస్ట్‌లు భర్తీ చేయాలని, మెనూ చార్జీలు పెరుగుతున్న ధరలు ప్రకారం పెంచాలని, ఎన్నికల డ్యూటీలు రద్దు చేయాలని అన్నారు. 5జి సెల్‌ఫోన్‌లు ఇవ్వాలని, గ్రాడ్యుటీ రూ.15లక్షలు, పెన్షన్ సదుపాయం, భీమా ర.15లక్షలు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రతి నెల నూనె, పప్పులు, గుడ్లు, నాణ్యమైనవి అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలన్నింటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతా అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోనె మణి, కార్యదర్శి రెడ్డి అరరుణ, నాయకులు భూక్యా లలిత, వేల్పుల మల్లికార్జున్, బండి నాగేశ్వరరావు, అన్నవరపు వెంకటేశ్వర్లు, వెంకట్రావు, నిమ్మల రాంబాబు, విజయ, వినోద, శ్రీలత, సరోజ, ఇంద్ర, నాగలక్ష్మి , సావిత్రి, సంధ్య, మాధవి, రమాదేవి, విజయలక్ష్మి , సునీత, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నట్టా.. లేనట్టా...?

**-బచ్చోడు, పిండిప్రోలు కేంద్రంగా**
**అక్రమ రేషన్ బియ్యం దందా**
**-వంద క్వింటాల బియ్యం పట్టుబడినా**
**అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలం**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండల పరిధిలో వందల క్వింటాల రేషన్ బియ్యం ఇతర రాష్ట్రాలకు ఇతర జిల్లాలకు తరలిస్తుంటే కనీసం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమ రేషన్ బియ్యానికి అడ్డుకట్ట వేయాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సివిల్ సప్లై అధికారులు రేషన్ వ్యాపారస్తుల వద్ద లంచాలకు పాల్పడుతు తూతు మంత్రంగా తనిఖీలు చేస్తూ అక్రమ రేషన్ బియ్యాం వ్యాపారానికి స్వర్గ ద్వారాలు తెరుస్తున్నారు. మండల పరిధిలో ని తిరుమలాయపాలెం, బచ్చోడు, పిండిప్రోలు జూపెడ, పైనంపల్లి, ఏదుల చెరువు, కాకరవాయి, సుబ్లేడు, పాతర్లపాడు, తిప్పారెడ్డిగూడెం, అజ్మీర్ తండా, హైదర్ సాయి పేట, పడమటి తండా, గ్రామాలను కేంద్రంగా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం నడుస్తుందని స్థానికులు చెప్తున్నారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో వైరాలోని అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం పై రాష్ట్రస్థాయిలో చర్చగా మారిన విషయం తెలిసిందే తిరుమలాయపాలెం మండలంలో పోలీసులు రెవెన్యూ అధికారులు ట్రాన్స్పోర్ట్ పోలీసులు అక్రమ రేషన్ వ్యాపారస్తులను కట్టడి చేసి పట్టుకుంటే తప్ప ఎన్ఫోర్స్మెంట్ సివిల్ సప్లై అధికారులు రేషన్ కేంద్రాలలో కనీసం బియ్యం నిల్వ తనిఖీ చేయకుండా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారస్తుల వద్ద లంచాలకు పాల్పడుతున్నట్లు సమాచారం తిరుమలాపురం మండలంలో సుమారు ప్రతినెల 100ల టన్నుల రేషన్ బియ్యం ఇతర జిల్లాలకు సప్లై చేస్తూ అక్రమార్గంలో లక్షల రూపాయలు ప్రభుత్వం ప్రజా పంపిణీ పేరుతో ప్రతి నెల నిరుపేదలకు ఒక కుటుంబ సభ్యులకి మండల వ్యాప్తంగా 19 410 రేషన్ కార్డులు ఉండగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వం 6 కిలోల చొప్పున 35 వేల 34.52 కిలోల రేషన్ బియ్యం ప్రభుత్వం అందిస్తుంటే కొందరు అటు రేషన్ బియ్యాన్ని అక్రమ వ్యాపారస్తులకు విక్రయిస్తున్నారు. అవిగాక నేరుగా రేషన్ డీలర్ల వద్ద అక్రమ వ్యాపారస్తులు రేషన్ బియ్యాన్ని వాహనాలో లోడ్ చేస్తూ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. దీనిపై స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పర్యాటక కేంద్రంగా కనిగిరి గుట్టలు : కలెక్టర్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామ శివారులోని కనిగిర గుట్టల ప్రాంతం మంచి పర్యాటక ప్రాంతంగా భవిష్యత్‌లో మారుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం బెండాలపాడు అటవీ ప్రాంతాన్ని , బ్యాంబో క్లస్టర్‌ను ఆయన సందర్శించారు. ఈ నెల 11న పర్యాటకుల బృందాలు బెండాలపాడుకు రానున్న నేపథ్యంలో కలెక్టర్ స్థానిక అధికారులు, గిరిజనులు, బ్యాంబో క్లస్టర్ యూనిట్ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఐకెపి సభ్యులు తయారు చేసే వంటలను కలెక్టర్ స్వయంగా రుచి చూశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులకు గిరిజనులు దగ్గర ఉండి ఈ ప్రాంతాన్ని చూపించాలన్నారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ ప్రాంత గిరిజనులకు ఆదాయ మార్గంగా తయారువుతుందన్నారు. మండల అధికారులు స్థానికులకు పర్యాటకుల గురించి అవగాహన కల్పించాలన్నారు. బ్యాంబ్ క్లస్టర్‌లో ఉత్పత్తులను పెంచాలన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపిడివో అశోక్, బెండాలపాడు బ్యాంబో క్లస్టర్ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

# ‘ప్రజాపక్షం’ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపక్షం విశేషంగా కృషి చేస్తోందని, అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షాన పని చేస్తుందని ఎస్‌ఐ రతీష్ అన్నారు. ప్రజాపక్షం దిన పత్రిక యాజమాన్యం ప్రచురించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆళ్లపల్లి మండల విలేఖరి బోడకుంట బిక్షం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ముందుగా ఆయన మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యానికి, విలేకరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ, ప్రజా సమస్యలు వెలికి తీసి వాటి పరిష్కారానికి , కృషి చేయడంలో ప్రజాపక్షం పత్రిక ఎప్పుడూ ముందు వరసలోనే ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్‌ఐలు వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఇండియా టూరిజం మ్యాపులో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేక స్థానం కల్పిస్తాం



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు తయారు చేసి ఇండియా టూరిజం మ్యాప్‌లో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేక స్థానం కల్పించేలా చర్యలు చేపడుతామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖల మంత్రి భట్టివిక్రమార్క అన్నారు. అడువులు, గుట్టలను వినియోగిస్తూ ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నమన్నారు. మండలంలోని అడువులు, చెరువులే మన ఆస్తిని వాటిని రక్షించాలని అన్నారు. మంగళవారం ఎర్రుపాలెం మండలంలో పర్యటించిన ఆయన జమలాపురం అటవీపార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఇండియా టూరిజం మ్యాపులో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేక స్తానం కల్పించేలా పర్యాటకంగా మండలాన్ని అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. రూ.5.83కోట్లతో చేపట్టిన జమలాపురం అటవీపార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు బీమానాయక్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా అటవీ అధికారి సిద్ధార్ద్ విక్రమ్ సింగ్, ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, ఎప్‌డిఓ మంజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండారు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

**ప్రజాపక్షం/మణుగూరు రూరల్:** తీసుకున్న రుణం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో రుణం ఇచ్చిన వ్యక్తి చెక్ బౌన్స్ తో కోర్టును ఆశ్రయించగా, పూర్వాపరాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి ఆరు నెలల జైలు శిక్షతో పాటు మూడు లక్షల నష్ట పరిహారం విధించారు. వివరాలిలా ఉన్నాయి... 2020లో మణుగూరుకు చెందిన కంకటాల నాగ వెంకట శ్రీనివాస్ బాయి కూనవరం నకు చెందిన మొహిద్ ముత్తుజా కు రూ.3 లక్షలు రుణం ఇచ్చాడు. అందుకుగాను తీసుకున్న చెక్కును శ్రీనివాస్ బ్యాంక్ లో జమ చేయగా, బౌన్స్ అయింది. దీంతో బాధితుడు కోర్టులో కేసు దాఖలు చేయగా, సాక్షాధారాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి మత్తుజా కి రూ. 3లక్షల జరిమానా విధించడంతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నెల వ్యవధిలో 3 లక్షల నగదు కట్టని పక్షంలో మరో నెల కాలం జైలు శిక్షను అదనంగా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఫిర్యాదుదారుని తరుపున న్యాయవాదులు ఎస్వీ రమణారెడ్డి, బద్దం శ్రీనివాసరెడ్డి, సీహెచ్. గురు కృష్ణ లు వాదించారు.

# పేకాట, కోడిపందెం రాయుళ్లకు కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేకాట, కోడిపందెం రాయుళ్ళకు కల్లూరు ఏసిపి అని శెట్టి రఘు ఆదేశాల మేరకు సత్తుపల్లి సిఐ కిరణ్ కుమార్ మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించి, రూ లక్ష బైండోవర్ చేయించారు. సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గత మూడు సంవత్సరాల నుండి పేకాట, కోడిపందాల కేసులలో ఉన్న నిందితులు, కోడి కత్తులు తయారు చేయు, కోడికత్తులు కట్టేవారిని, పేకాట రాయుళ్ళు సుమారు 25 మందికి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి జూదాలకు పాల్పడకుండా కౌన్సిలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో జూదాలలో పాల్గొనకుండా సత్తుపల్లి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రూ.లక్ష బైండోవర్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా సిఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మండల పరిధిలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి ఆర్గనైజ్డ్ గా కోడిపందాలు, పేకాట నిర్వహించకూడదని ఒకవేళ నిర్వహించినచో వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పేకాట, కోడిపందాల గురించి సమాచారాన్ని పోలీసులకు డయల్ 100 ద్వారా కానీ, లేదా సత్తుపల్లి ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్ 87126 59167 కి కాల్ చేసి సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# నేరుగా విత్తడం వలన రైతులకు లాభాలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** డ్రమ్ సీడర్‌తో నేరుగా విత్తడం ద్వారా రైతులకు అనేక లాభాలు ఉన్నాయని, రైతు శిక్షణకేంద్రం ఖమ్మం డిడిఏ అభిమాన్యు అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్లు రైతువేదికలో మొక్కజొన్న సాగు మెళకువలపై వీడియోకాన్ఫరెన్స్‌ను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గుర్రాలపాడులోని రైతు క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులు పంటల ఎదుగుదలలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, వాడాల్సిన మందులు, మోతాదులను వివరించారు. వ్యవసాయధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ ఎడిఎ సరిత, ఎఫ్‌టీసీ ఏఎడబ్ల్యూ అరుణజ్యోతి, అరుణకుమారి, భాస్కర్‌రావు, ఖమ్మంరూరల్ ఏఓ ఉమానాగేష్, ఏఈఓలు ఆదర్శ్, హిమబిందు, వంశీ, నజ్మి, కావ్య పాల్గొన్నారు.